క్లుప్తంగా

పర్యావరణంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

బాసర: మండలకేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈనెల 22 నుంచి జూన్ 5 వరకు ప్రపంచ పర్యావరణంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు రైల్వేస్టేషన్ మేనేజర్ రవీందర్ తెలిపారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు.

మొక్కలు నాటి రక్షించాలి

భైంసాటౌన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి రక్షించాలని మున్సిపల్ కమిషనర్ బి. రాజేశ్ కుమార్ అన్నారు. అమృత్ 2.0లో భా గంగా శుక్రవారం పట్టణంలోని సిద్దార్థనగర్‌లో మెప్మా ఆధ్వర్యంలో మహదేవ్ ఆలయం చెరువు సమీపంలో మొక్కలు నాటారు. మేనేజర్ గౌరీష్ కుమార్, మెప్మా టీఎంసీ సావిత్రి, సీఓలు వెంకటేష్, ముజమ్మిల్, ఆర్పీలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

'ఆరోపణలు సహించం'

ఖానాపూర్: రాష్ట్ర ప్రభుత్వం, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మోర్తాటి వంశీ అన్నారు. శుక్రవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. కడెం మండలం నచ్చన్‌ఎల్లాపూర్ వద్ద ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు వెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యేపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం హేయమైన చర్య అన్నారు.

బోనాల పండుగ



ఆలయానికి వెళ్తున్న మహిళలు

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి పంచాయతీ పరిధి చింతల్‌పేట్ గ్రామంలో శుక్రవారం గంగపుత్రుల సంఘం ఆధ్వర్యంలో సదరు బోనాల పండుగ నిర్వహించారు. డప్పుచప్పుళ్ల నడుమ బోనాలను తీసుకెళ్లి గంగమ్మ తల్లికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అన్నదానం చేపట్టారు.


దోమల నివారణ మందు పిచికారీ

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఓ వ్యక్తి మలేరియా బారిన పడగా.. అతడి ఇంటి పరిసరాల్లో శుక్రవారం మున్సిపల్ సిబ్బంది దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వ్యాధిగ్రస్తుని కుటుంబసభ్యులకు వైద్య సిబ్బంది రక్తపరీక్షలు నిర్వహించి జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్, జవాన్ సంతోష్, వెంకటస్వామి, మహేందర్, రాధ తదితరులు పాల్గొన్నారు.

ఆవాసానికి బియ్యం అందజేత

భైంసాటౌన్: తానూరు మండలం బెల్‌తరోడాకు చెందిన చుక్కబొట్ల నాగేశ్ తన తండ్రి చుక్కబొట్ల పోశెట్టి జ్ఞాపకార్థం పట్టణంలోని స్వామి వివేకానంద అనాథ పిల్లల ఆవాసానికి వంద కేజీల బియ్యం విరాళంగా అందజేశారు. శుక్రవారం ఆవాసం సందర్శించి నిర్వాహకులకు బియ్యం అందించారు.

పరిశుభ్రతపై దృష్టి సారించాలి



ఎల్విలో పరిశీలిస్తున్న ఎంపీడీవో నసీరొద్దీన్

తానూరు: వర్షాకాలంలో పరిసరాలు శుభ్రంగా ఉండేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో నసీరొద్దీన్ సూచించారు. శుక్రవారం మండలంలోని ఎల్వి గ్రామంలో పర్యటించారు. మురికి కాలువలను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేసిన నీటిని అందించాలని సూచించారు. పంచాయతీ నర్సరీని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ఖర్చుల వివరాలు, రికార్డులు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

'పాకాల'కు ఐకేరెడ్డి అభినందన

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏప్రిల్ 7 నుంచి ఈనెల 22 వరకు పాకాల ఫౌండేషన్ చైర్మన్ రాంచందర్ ఉచితంగా అంబలి పంపిణీ చేశారు. శుక్రవారం నిర్మల్‌లోని తన నివాసంలో మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి.. రాంచందర్‌ను సత్కరించి అభినందించారు. పీఏసీఎస్ చైర్మన్ వీపీ రమణారెడ్డి, దశరథ రాజేశ్వర్, భూమేష్, మేడారం ప్రదీప్, మల్లేశ్, భాస్కర్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భైంసాలో ముందస్తు చర్యలేవి?

- పట్టణంలో అస్తవ్యస్తంగా పారిశుధ్యం
- నిద్రావస్థలో శానిటేషన్ వ్యవస్థ
- డ్రెయినేజీల్లో పేరుకుపోయిన పూడిక
- వర్షాకాలంలో పొంచిఉన్న రోగాల ముప్పు



ఫైర్‌స్టేషన్ ఆవరణలో మురుగునీరు



టీఎన్జీవోస్ కాలనీ వద్ద చెత్తాచెదారంతో నిండిన డ్రెయినేజీ

భైంసాటౌన్: పట్టణంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. డ్రెయినేజీల్లో పూడిక తొలగించకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. మరోవైపు ఇంటింటి నుంచి చెత్తసేకరణ సక్రమంగా చేపట్టడం లేదు. ఫలితంగా కొన్ని కాలనీల్లో ఖాళీ ప్రదేశాల్లో చెత్త పారవేస్తున్నారు. పారిశుధ్య కార్మికులు సకాలంలో ఎత్తివేయకపోవడంతో, పందులు చేరి పరిసరాలు దుర్గంధంతో మారుతున్నాయి. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని పలువురు కాలనీవాసులు ఇటీవల మున్సిపల్ ప్రత్యేకాధికారి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ దృష్టికి తెచ్చారు. మరోమారు తన దృష్టికి రాకుండా సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌ను హెచ్చరించారు. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదు.

డ్రెయినేజీల్లో భారీగా పూడిక..

పట్టణంలోని పాతకాలనీల్లో దాదాపు అన్నిచోట్ల ఇరుకైన శిథిలావస్థకు చేరిన డ్రెయినేజీలు ఉన్నాయి. సరైన మురుగునీటి పారుదల వ్యవస్థ లేకపోవడంతో, చెత్తాచెదారం పేరుకుపోతోంది. మరికొన్ని చోట్ల డ్రెయినేజీలపై ఆక్రమణలు కుచించుకుపోయి.. మురుగునీటి పారకానికి ఇబ్బంది ఏర్పడుతోంది. పట్టణంలోని టిప్పు సుల్తాన్ చౌరస్తా, ఫిష్ మార్కెట్ ఏరియా, వివేకానంద (కుభీర్)చౌరస్తా, ఆటోనగర్ బైపాస్ రోడ్, టీఎన్జీవోస్ కాలనీ, రాహుల్‌నగర్, బస్‌డిపో ప్రాంతం, శివారు కాలనీలు తదితర చోట్ల డ్రెయినేజీల్లో పూడిక పేరుకుపోయింది. దీంతో ఎగువ నుంచి వచ్చే మురుగునీరు పారకానికి ఇబ్బంది ఏర్పడి.. వర్షం పడిన సందర్భాల్లో డ్రెయినేజీ నీరు పొంగి రోడ్లపైకి చేరుతోంది.

వ్యాధుల ముప్పు..

రానున్నది వర్షాకాలంలో భారీవర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఈనేపథ్యంలో మున్సిపల్ శానిటేషన్ విభాగం ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరముంది. మురుగునీరు ప్రవాహం అధికంగా ఉండే డ్రెయినేజీల్లో పూడిక తొలగించి, మురుగు, వాన నీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలి. కాలనీల్లో ఖాళీ ప్రదేశాల్లో చెత్త పారవేయకుండా చూడాలి. గతంలో వర్షాలకు డ్రెయినేజీలు పొంగి లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరిన సందర్భాలున్నాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ శానిటేషన్ విభాగం ఇప్పటికైనా మేల్కొని ముందస్తు చర్యలు చేపట్టాలని పట్టణవాసులు పలువురు కోరుతున్నారు.

ఇబ్బందుల్లేకుండా చూస్తాం..

పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటాం. డ్రెయినేజీల్లో పారిశుధ్య సిబ్బందితో పూడిక తీయిస్తాం. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటాం.

– బి రాజేశ్‌కుమార్, కమిషనర్, భైంసా

ఉపాధ్యాయులే భావి సమాజ నిర్మాతలు

- ఎమ్మెల్యే పి.రామారావు పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్



సోన్ : కడ్తాల్ పాఠశాలలో ఉపాధ్యాయులు

భైంసాటౌన్: ఉపాధ్యాయులే భావి సమాజ నిర్మాతలని.. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరిగేలా విద్యాబోధన చేయాలని ముధోల్ ఎమ్మెల్యే పి. రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం పట్టణంలో మండలస్థాయి ఉపాధ్యాయులకు ఐదురోజుల శిక్షణ తరగతులు ప్రారంభించగా ఆయన హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ.. విద్యార్థుల ప్రవేశాలు పెరిగేలా కృషి చేయాలన్నారు. డీఈవో రామారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు బోధనలో నాణ్యత పెంచేందుకు దోహదపడతాయన్నారు. ఎంఈవో సుభాష్, ఆర్పీలు ఎల్లన్న, కృష్ణ, రాజేశ్వర్, హన్మాండ్లు, గణేశ్, విఠల్‌రెడ్డి, నరేశ్, బ్రహ్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులను జ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలి

సోన్: ఉపాధ్యాయులు నైపుణ్య శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను జ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలని ఎంఈవో పరమేశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కడ్తాల్ గ్రామ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో ఎంఈఓ మాట్లాడారు. శిక్షకులు ఇన్‌చార్జి ఆరాధన, రిసోర్స్ పర్సన్లు సాయికుమార్, గోవర్ధన్, రాందాస్, హేమలత, కృష్ణవేణి, రాజేశ్వర్, విద్యాసాగర్‌రెడ్డి, వికేశ్ తదితరులు పాల్గొన్నారు.

కుభీర్: మండలంలోని వివిధ పాఠశాలల్లో పని చేసే 87 మందికి కుభీర్ ఉన్నత పాఠశాలలో ఎఫ్ఎల్ఎస్‌పై శిక్షణ నిచ్చారు. తెలుగు, గణితం, ఇంగ్లిష్, పరిసరాల విజ్ఞానంపై రిసోర్స్ పర్సన్లు దత్తాత్రి, నాగోరావ్, ప్రవళిక, భవిత శిక్షణనిచ్చారు. ఎంఈవో విజయ్‌కుమార్ నేర్చుకున్న విషయాలను పిల్లలకు నేర్పించాలని పేర్కొన్నారు. కోర్స్ ఇన్‌చార్జిగా పల్సి హెచ్‌ఎం డి.సురేష్ వ్యవహరించారు.

కుంటాల: ఉపాధ్యాయుల బోధన విద్యార్థులను ఆకట్టుకునేలా ఉండాలని జిల్లా రిసోర్స్ పర్సన్ మాదరి ఎల్లన్న సూచించారు. మండలంలోని కల్లూరు ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతులను శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీలు శ్రీనివాస్, సుధాకర్, వివేకానంద, ప్రియాంక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కుభీర్‌లో ఉపాధ్యాయులతో అధికారులు

ఉపాధ్యాయుల శిక్షణ పరిశీలన

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణను శుక్రవారం జిల్లా రిసోర్స్ పర్సన్ మాదరి ఎల్లన్న పరిశీలించారు. తెలుగు, ఆంగ్లం, గణితం పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులను నూతనంగా బోధించాలని సూచించారు. ఎంఈవో చంద్రకాంత్, ఎమ్మార్పీలు చిన్నయ్య, ప్రవీణ్, శ్రీనివాస్, సాయన్న ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి



దిలావర్‌పూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

దిలావర్‌పూర్: ప్రస్తుతం వాతావరణం మారుతున్నందున వరిధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. దిలావర్‌పూర్‌లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఇటీవలి వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులతో మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని షరతుల్లేకుండా కొనాలని డిమాండ్ చేశారు. అనంతరం మండలంలోని గుండంపల్లి ,దిలావర్‌పూర్ గ్రామాల పరిసరాల్లో ఆయిల్ ఫాం తోటల్లో గెలల కోతను ప్రారంభించారు. ప్రీయూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారు నిర్మల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో గెలలను కొంటారని పేర్కొన్నారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే నల్లా ఇంద్రకరణ్‌రెడ్డి, జమాల్ సత్యం చంద్రకాంత్, డి.ముత్యంరెడ్డి, జంగం వీరేశ్, భోజారాం పాటిల్, రైతులు పాల్గొన్నారు.

ప్రయాణికుడికి బ్యాగ్ అప్పగింత

భైంసాటౌన్: బస్సులో ఓ ప్రయాణికుడు తన బ్యాగ్ మర్చిపోగా ఆర్టీసీ ఉద్యోగులు తిరిగి అప్పగించారు. కుంటాల మండలం సూర్యాపూర్ మాజీ ఎంపీటీసీ పెద్దింటి పోశెట్టి శుక్రవారం ఆర్టీసీ బస్సులో కల్లూరు నుంచి భైంసా వచ్చారు. తన వెంట తెచ్చుకున్న బ్యాగును బస్సులోనే మర్చిపోయాడు. ఈ విషయం తెలుసుకుని బస్టాండ్‌లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భూమన్నకు సమాచారమిచ్చాడు. ప్రయాణికుడి టికెట్ ఆధారంగా వివరాలు గుర్తించి బ్యాగును పోశెట్టికి అప్పగించారు.

వ్యాయామ విద్య తప్పనిసరి

నిర్మల్‌రూరల్: ప్రతి విద్యార్థికి వ్యాయామ విద్య తప్పనిసరి అని రాష్ట్ర రిసోర్స్ ఉపాధ్యాయుడు, రాష్ట్ర పరిశీలకుడు డా.వెంకన్న అన్నారు. జిల్లాకేంద్రంలోని విజయ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈ విద్యాసంవత్సరం వ్యాయామ విద్యపై పుస్తకం రాబోతుందని.. పాఠశాలలో ప్రత్యేక పీరియడ్ కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఆటలపై, కోర్టులు వేసే విధానము, కొలతలు, క్రీడా పరికరాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ సమన్వయకర్త, కోర్సు బాధ్యులు ప్రవీణ్‌కుమార్, డీఆర్పీలు ఎం.శ్రీనివాస్, వి.భూమన్న, అన్నపూర్ణ, జమున, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశభక్తిని చాటేలా తిరంగా ర్యాలీ



20 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఆపరేషన్ సింధూర్‌తో పాక్ ఉగ్రవాదులను మట్టుబెట్టిన సైనికుల ధైర్యాన్ని కీర్తిస్తూ శుక్రవారం పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డితో సహా యువజన సంఘాలు, పౌరులు పాల్గొన్నారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ వరకు ర్యాలీ సాగగా.. జాతీయ జెండాను పట్టుకొని భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు రితీశ్ రాథోడ్, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, బీజేపీ నాయకులు అంజుకుమార్‌రెడ్డి, రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మ రాజు, రాజేశ్వర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు అర్జున్ నిర్మల్ పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సాయి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

లక్ష్మణచాంద: మండలంలోని న్యూకంజర్ గ్రామ హనుమాన్ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం చేపట్టారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

డిగ్రీ పరీక్ష కేంద్రాలు తనిఖీ



కల్లూరు డిగ్రీ కళాశాలలో పరిశీలిస్తున్న అబ్జర్వర్లు

నిర్మల్‌రూరల్: జిల్లాలోని పలు డిగ్రీ కళాశాలల్లో జరుగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను కాకతీయ యూనివర్సిటీ అబ్జర్వర్లు శుక్రవారం పరిశీలించారు. జిల్లాలోని కల్లూరు, కుంటాల, భైంసా, సారంగాపూర్, లోకేశ్వరం మండల కేంద్రాలలో ఉన్న పరీక్షా కేంద్రాలను వారు తనిఖీ చేశారు. పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇందులో ప్రొఫెసర్ రాజేంద్ర కట్ల, ఎం.తిరుమలదేవి, డాక్టర్ పి.వెంకటయ్య తదితరులున్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



కల్యాణం జరిపిస్తున్న పండితులు

సోన్: మండలంలోని న్యూవెల్మల్‌లో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆల య వార్షిక బ్రహ్మోత్సవాలు ము గిశాయి. చివరిరోజైన శుక్రవారం స్వామివారికి అలంకరణ, నిత్య అ ర్చన శేషహోమం , పూర్ణాహుతి, స్వామి వారి ఎదుర్కోలు, కల్యాణోత్సవం పుష్పయాగం, ఏకాంత సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ఆలయం వద్ద మహా అన్నదానం నిర్వహించారు. యజ్ఞాచార్యులు శ్రీమన్ డాక్టర్ చక్రపాణి నరసింహమూర్తి, అర్చకులు శ్రీమన్ ముద్ర రాజ్యం, వెంకట రామకృష్ణ ఆచార్యులు, పెంట దత్తాద్రి, వేణు, గంగాధర్, వీడీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకోవాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్
- 'పది'లో ప్రతిభ కనబర్చినందుకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పురస్కారాలు



విద్యార్థినికి పురస్కారం అందిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, పక్కన ఎమ్మెల్యేలు

నిర్మల్‌రూరల్: పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకొని.. వాటిని చేరుకునేందుకు పట్టుదలతో కృషి చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇటీవల పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 106 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కలెక్టర్, నిర్మల్, ముధోల్ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, రామారావు పటేల్ హాజరై జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల విజయంలో భాగస్వాములైన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గర్వంగా ఉందని.. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని.. క్రమశిక్షణతో విద్యను కొనసాగించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించి సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో రామారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలీ, భైంసా ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రెక్కల కష్టం.. వర్షంపాలు



ముధోల్: విఠోలిలో ధాన్యం చూపుతున్న రైతులు



కుంటాలలో వర్షపు నీటిలో జొన్నల కుప్పలు



ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మొలకెత్తిన ధాన్యం చూపుతున్న రైతు

ముధోల్/కుంటాల/ఖానాపూర్: మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు రైతులు అల్లాడుతున్నారు. ముధోల్ మండలం, ఖానాపూర్ మండలం, కుంటాల మండలంలోని గ్రామాల్లో శుక్రవారం అకాల వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కుప్పలు, జొన్నల పంట తడిసిపోయింది. పంటలకు వచ్చిన మొలకలను చూపుతూ రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. టార్పాలిన్లు వేసి పంటను కాపాడుకుంటున్నారు. కొనుగోళ్లు చేపట్టాలని రైతులు వేడుకుంటున్నారు.

ఇంటర్ పరీక్షలకు 97 మంది గైర్హాజరు

నిర్మల్‌రూరల్: జిల్లాలో శుక్రవారం జరిగిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్, సప్లిమెంటరీ పరీక్షలకు 97 మంది విద్యార్థులు హాజరైనట్లు డీఐఈఓ పరుశురాం తెలిపారు. ఇంటర్ ఫస్టియర్‌లో 890 మంది విద్యార్థులకు గాను 821మంది హాజరవగా.. 69 మంది గైర్హాజరయ్యారు. జనరల్ కేటగిరీలో 799 మందికి గాను 734మంది హాజరవగా 65 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులో 91 మంది విద్యార్థులకు గాను 87 మంది.. సెకండ్ ఇయర్‌లో 245 మంది విద్యార్థులకు గాను 217 మంది హాజరైనట్లు వివరించారు. జనరల్ కేటగిరిలో 221 మందికి గాను 194 మంది హాజరవగా 27 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులో 24 మందికి గాను 23 మంది హాజరైనట్లు డీఐఈఓ వివరించారు.

బస్సు ప్రారంభం



చింతల్‌చాందకు వస్తున్న బస్సు

సాక్షి ఎఫెక్ట్..

లక్ష్మణచాంద: మండలంలోని గ్రామాల్లో రోడ్లపై వరిధాన్యం ఆరబెట్టడంతో 20 రోజులుగా చింతల్‌చాందకు ఆర్టీసీ బస్సు బంద్ అయింది. దీంతో మండలకేంద్రం, పొట్టపెల్లి(కే), చామన్‌పెల్లి, చింతల్‌చా ంద గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈనెల 19న సాక్షిలో రోడ్లపై ధాన్యం శీర్షికన కథనం ప్రచురించింది. స్పందించిన అధికారులు శుక్రవారం చింతల్‌చాందకు బస్సు ప్రారంభించారు.

కాల్వపై కప్ప ఏర్పాటు



పైకప్పు వేయించిన కార్యదర్శి రాజబాపు

కుంటాల: మండలకేంద్రంలోని 12వ వార్డులో సీసీ రోడ్డు నిర్మించి అక్కడున్న మురుగు కాల్వపై స్లాబ్ మరిచారు. దీనిపై ఈనెల 21న బుధవారం సాక్షిలో కాల్వపై స్లాబ్ మరిచారు శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి రాజబాపు.. సిబ్బందితో మురుగు కాల్వపై పైకప్పు వేయించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో కాలనీవాసులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

'ఐకేరెడ్డిని విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదు '

నిర్మల్‌టౌన్: మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని విమర్శించే స్థాయి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు లేదని డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్ రెడ్డి అన్నారు. గురువారం నిర్మల్ నియోజకవర్గ నాయకులతో హైదరాబాద్‌లో కేటీఆర్, ఐకేరెడ్డిపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో దిలావర్‌పూర్ పీఏసీఎస్ చైర్మన్ రమణారెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జెడ్పీచైర్మన్‌గా, రెండు సార్లు ఎంపీగా, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలు అందించిన ఘనత ఇంద్రకరణ్‌రెడ్డి సొంతమన్నారు. ఇంద్రకరణ్‌రెడ్డి అనుభవం చూసి కేసీఆర్ మంత్రిగా అవకాశం ఇచ్చారని గుర్తు చేశారు. కేటీఆర్ వెంటనే తన మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు సైతం ఐకేరెడ్డి ద్వారా లబ్ధి పొందిన వాళ్లే అని విమర్శించారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ నారాయణరెడ్డి, రాంచందర్, సత్యనారాయణ, ప్రదీప్ రెడ్డి, అనుముల భాస్కర్, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఫారంపాండ్‌ల నిర్మాణం పరిశీలన



ఫారంపాండ్ పరిశీలిస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

మామడ: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలోని పొన్కల్ అటవీ ప్రాంతంలో చేపట్టిన ఫారంపాండ్‌ల నిర్మాణాలను శుక్రవారం డీఆర్డీవో విజయలక్ష్మి పరిశీలించారు. నిర్మాణాలపై సంతృప్తి వ్యక్తం చేసి.. మరిన్ని ఫారంపాండ్‌ల నిర్మాణం చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఫారంపాండ్‌ల నిర్మాణాలతో భూగర్భ జలాలు పెరగడంతోపాటు వన్యప్రాణుల దాహార్తి తీరుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో శివాజీ, ఫీల్డ్ అసిస్టెంట్ ముత్యం ఉన్నారు.